# విరిసిన పూవు

వసంతోదయం. పాతబడిన ఆ మేడ, పెరట్లో జీబురుగావున్న పిచ్చిమొక్కల మధ్య, వున్న ఒకే ఒక మల్లెచెట్టునున్న చిన్నమొగ్గ కళ్ళువిప్పి చూసింది. ఆ మల్లెచెట్టుకి ఎవరూ కుదురుతవ్వి నీళ్ళుపోసిన పాపాన పోలేదు. అయినా ఋతు ధర్మాన్ని అనుసరించిన ఆ మల్లె, తనకు తానే నిలువుగా చిగుళ్ళని సింగారించుకుంది. ఆ దట్టమైన చిగుళ్ళ మధ్య ఒక్కటే ఒక్క మొగ్గని నిలువబెట్టింది. అప్పుడే కళ్ళు విప్పిన ఆ మొగ్గ చల్లని చిరుగాలికి మెల్ల మెల్లగా కళ్ళు త్రిప్పుకుంటూ తన పరిసరాల్ని ఆహ్లాదకరంగా చూస్తూ వొళ్ళు విరుచుకుంది. గాలి బాల యొక్క చల్లని వూపుకి, ఆ మెత్తని రేకులు వొక్కసారిగా విడివడ్డాయి తన రేకల్లోని మృదుత్వానికీ, ధవళత్వానికీ, ఆ చిన్నపూవుకు, అమితంగా గర్వం వచ్చిపడింది. ఒక్కసారి తలవిదిలించి చుట్టూవున్న అర్థంలేని గడ్డిమొక్కలకేసి హేళనగా చూసింది. ఆ మొక్కలన్నీ ఒక్కసారిగా ఫక్కుమని నవ్వాయ్! మల్లెపూవుకి కోపం వొచ్చింది.

"ఎందుకలా నవ్వుతారు అర్థంలేకుండా ?" అధికారంగా అడిగింది.

"అర్థంలేకుండా నవ్వు వస్తుందా పాపా?" అన్నాయి ఆగడ్డి మొక్కలు.

"పాపా! ఏమిటా సంబోధన? నేను చంటిదాన్నా!" కోపంగా అటూ ఇటూ వూగింది.

"కాకపోతే ? కళ్ళు తెరిచి నాలుగు నిమిషాలన్నా కాలేదు. నువ్వేదో పెద్ద ఆరిందాలా వూహిస్తున్నావు!"

"నేనేం వూహిస్తున్నాను?"

"ఏం వూహిస్తావు! నీతోటే ఈ జగత్తుఅంతా పరిమళ భరిత మౌతున్న దనుకుంటావు. నీవు లేకపోతే ఈ సృష్టికి అంతరాయం కలిగిపోతుందని ఆదుర్దా చెందుతావు. నీ అందానికున్న విలువ కోటినక్షత్రాలకూడా లేదని భ్రమ చెందుతావు. తెలినితనంలో ఎన్నెన్నో ఆశల లేసులు అల్లుతావు!"

"అయితే? ఆశ పాపమా!"

"పాపం కాదు పాపా! దోషం అంతకన్నా కాదు. కాని, వాస్తవికతకు ప్రాధాన్య మివ్వకుండా కాల్పనిక జగత్తులో విహరించావంటే వాస్తవికతను ఎదుర్కోవలసి వచ్చినప్పుడు నీ అవికసిత హృదయం తట్టుకోలేదు"

"అబ్బబ్బ! ఏమిటీ మెట్టవేదాంతం?" విసుగ్గా అంది.

"వేదాంతం కాదు. నీ మనుగడగూర్చి వివరిస్తాను. క్షణికంలో అంతమయ్యే సౌందర్యం నిత్యమని భ్రమచెంది అహంకారం పెంచుకోకు"

పూవు మూతి ముడుచుకున్నది. దాని చెవుల్లో ఏదో రొదగా వినపడింది.

"ఏమి టీ సొద? అందరికీ నన్నుచూస్తే అసూయేనా? నన్ను బ్రతకనివ్వరా?" బాధగా అంది.

"బాధతో కుమిలిపోకు! పాపా! నేను వొచ్చాను చూడు!"

"ఎవరు నువ్వు?"

"నీ భ్రాతృ సమానుణ్ణి! మలయ సమీరుణ్ని! నీ పరిమళాన్ని విశ్వవ్యాప్తం కావటానికి ఫలాపేక్ష లేకుండా శ్రమిస్తుండేవాణ్ణి."

"ఎందుకు వొచ్చావు?"

"నువ్వు నీతోటి మొక్కలమీద అలుక వహిస్తున్నావు. వాట్ల హృదయగత సౌందర్యాన్ని నువ్వు చూడలేక పోతున్నావు. వాట్ల హెచ్చరికలో ఎంతో సత్యం ఇమిడి వుంది!"

"నిన్ను సాక్ష్యానికి పిలుచుకొన్నాయేం?" విసురుగా, తిక్కగా అంది.

"అవి పిలువలేదు. నీకు అనుభవ పూర్వకంగా నిరూపిద్దామని నా అంతట నేనే వచ్చాను"

"నే నిక్కడ్నే వుంటినాయె! నాకెలా అనుభవమౌతుందీ?"

"అదే చెప్తున్నాను చెల్లీ! ఈ మేడలో రకరకాల వ్యక్తులున్నారు. వాళ్ళతో మాట్లాడావంటే, నీకు జీవితం

అంటే ఏమిటో తెలుస్తుంది. అంచేత నిన్నక్కడికి తీసుక పోదామని సంకల్పించాను."

పూవు సంతోషంతో చప్పట్లు కొట్టింది.

"నీకు ఎంతైనా కృతజ్ఞతలోయ్! నేను ఇందాకణ్ణించీ మనుష్యుల మధ్యకి వెళ్లాలని ఎంతగానో ప్రయత్నిస్తున్నాను. ఈ చుప్పనాతి మూక మధ్యనించి మమ్మల్ని అమితంగా గౌరవించే స్త్రీమూర్తుల వద్దకు ఎలా వెళ్ళేది! ఇంత మారు మూలగా వుండిపోయాను, లేచినది మొదలు చూస్తున్నాను ఒక్కరూ ఇటువైపు రావడంలేదు."

"ఆ బెంగ నీకక్కరలేదు చెల్లీ! అందుకనే నేను నిన్ను తీసుకుపోదామని చూస్తున్నాను."

సమీరుడు అప్పుడే విరిసిన ఆ చిన్నపూవును మృదువుగా చిగుళ్ళ చివర్లనుంచి వేరుచేశాడు.

అదొక పెద్ద పాతమేడ! ఒకవైపునుంచి పడిపోతూ వుంది. పెరడు అంతా గడ్డీ, గాదం మొలిచి, చీకిరి బాకిరిగా కన్పడుతుంది పేరు తెలియని పెద్ద పెద్దచెట్లు దయ్యాలను ఆహ్వానిస్తూ, తలలు విరబోసుకుని నించున్నాయి. వాట్ల క్రింద రాలిన పండుటాకులు ఎండిపోతున్నాయి! ఎండిన పండ్లు మట్టిలో కలిసిపోతున్నాయి!

సమీరకుమారుడు ఆ మల్లెపూవును మేడ క్రింది భాగంలో వరండాలో కూర్చుని, వండుకుంటున్న ఒక యాభై ఏళ్ళ వనిత దగ్గరకు తీసుకవొచ్చాడు! ఆ వనిత రొట్టెలపిండి కలుపుకుంటున్నది. కుంపటిలోని బొగ్గులు

ఎర్రగా, కణకణ మండుతున్నాయి. ఆ వనిత తనలోతనే ఏదో సణుక్కుంటున్నది. పూవు ఎగురుకుంటూ ఆమె చెవి వద్దకు వెళ్ళి,

"నేను వొచ్చాను చూడు!" అన్నది సంతోషంగా.

"ఎవరు నువ్వు?"

"నేను! నేనెవర్ని? జీవితానందాన్ని! నీకోసం, ఒక్క నీకోసమే ఎన్నెన్నో ఆశలు, సుందర స్వప్నాలలో తేలిపోయే ఇంద్రధనస్సు రంగుల్లో రంగరించి, నా పరిమళంతో నింపి నీకు కానుకగా తెచ్చాను."

ఆ స్త్రీమూర్తి బాధగా నవ్వింది.

"పిచ్చిదానా ? నా కెన్నేళ్లో తెలుసా నీకు ?"

"మనోధర్మానికి వయస్సుతో నిమిత్తం వున్నదా ?" జిజ్ఞాసగా అడిగింది ఆ పూవు.

"ఆగు ! ఒక్కక్షణం ! నాలోని కోరికల్లా, భగ భగ మండే ఆ నిప్పుల్ని చల్లార్చి చెప్తాను. ఆశలు, కోరికలు నిప్పుల్లాంటివి చిట్టీ ! నిప్పును ముట్టుకుంటే చెయ్యి కాల్తుంది. కోరికలు తీర్చుకోవాలన్న మానసికాగ్నిని ప్రజ్వరిల్లనిస్తే ఈ శరీరమే దహించుకపోతుంది. అంచేత నిర్దాక్షిణ్యంగా ఆ నిప్పుల్ని ఈ కోరికల్ని చల్లార్చుకోవాలి." చెంబుతో నీళ్ళు తెచ్చి ఆ నిప్పులమీద పోసింది.

"కోరికలు ప్రకృతి సహజం" అన్నది — పూవు.

"అవేం నాకు తెలీదు చిట్టీ ! నా జీవితం చరమాంకాన్న నడుస్తున్నది. ఇప్పుడు తోటి స్త్రీలను చూస్తోంటే

నా గతమంతా పీడకలగా కన్పడుతున్నది. చీకటి ముద్దలాంటి అసంతృప్తి నాలో గూడుకట్టుకున్న నన్ను నేను తెలుసుకో లేకపోయాను. నా కళ్ళు తెరిపిన పడేటప్పటికి కాలం కరిగి పోయింది."

"అబ్బ !" అంది పూవు బాధగా.

"మా రోజులు ! అవి రోజులు కావు. యమపాశాల ఇనుపరింగులు ! వ్యర్థపు ఆచారాల ముక్క తీగెలు తెంప టానికి ఎవ్వరికీ తరమయ్యేదికాదు. నాలుగు గోడల మధ్య పురుషుని హస్తాల్లో బందీ లయిన స్త్రీలు, పరమ పతివ్రితలు! వారికి నల్లని ఆకాశం, మెరిసే తారకలూ, పచ్చని పచ్చిక బయళ్ళూ, విరిసిన పూవులూ, ఫలవంతమైన చెట్లూ, చేమలు సంతోషంగా జలజలపారే సెలయేళ్ళూ తెలియవు. తెలుసుకో ప్రియత్నించకూడదు. ఏవరైనా ఒక్కసారి తెలుసుకో ప్రయ త్నించితే వారు నీతిబాహ్యులు. ఈ సుందర ప్రిపంచాన్ని చూడకుండా తన్నే తను పర్దాలో బంధించుకుని, పరమ పతి వ్రితగా చరిత్రిలో లిఖించటం కోసం, జీవితానందాన్నే త్యజించారు ఆ స్త్రీలు. వారిని ఆ కాలం తా్ౖరచుపామై కరి చింది !"

"గతం కటిక చీకటి ! అటుకేసి చూడకు. చూడగా చూడగా ఒక్క చిరువెలుగు రేఖ కూడా కన్పడకుండా పూర్తి గుడ్డితనం ఆవరిస్తుంది. ఇప్పుడు నా కానుకని స్వీక రించి, తృప్తిగా మృత్యుదేవతను ఆహ్వానించు."

ఆ స్త్రీకి కళ్ళవెంట నీళ్ళొచ్చాయి.

"నీ అంత అవివేకిని నే నెక్కడా చూడ లేదు. నాలో ఏం మిగిలింది ? ఈ చేతులు చూడు. క్షణం కుంపటి వెచ్చదనం లోపించిందంటే, వేళ్ళు కొంకర్లు పోతాయ్. ఈ కళ్లు ఒకరోజున, దట్టమైన పరదాని చీల్చుకొని అనంత విశ్వాన్ని తనివితీరా చూడాలన్న ఆకాంక్షతో మండుకుపోయాయి. ఇప్పుడు వాటి సహజ దృష్టిని మందగించుకుంటున్నాయి. పది అడుగులు పచ్చిక మీాద నడుద్దామన్నా నడవలేను. ఆ ఆనందానికి, ఈ నీరసురాలు ఎన్నడూ నోచుకోలేదు. ఇంక దేని కని నీ అమూల్య కానుకని స్వీకరించను ? వెళ్ళు. చప్పున వెళ్ళి ఈ లోకంలో వున్న ఎంతోమంది అదృష్టవంతులకి, నీ నిక్షిప్తాలను సమర్పించు. ఇదే నా ఆశీర్వాదం ! నీ కానుకలు అపాత్రదానం కాకుండా వుండాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నాను."

పూవుకి కోపం వచ్చింది.

"నీకు ఈ శూన్య హృదయం ఎక్కడ దొరికిందీ ? బొత్తిగా గతస్మృతులైనా అలరింపదగ్గవి లేని ఈ వృద్ధ స్త్రీ దగ్గర నే నెందుకు ?"

సమీారుడు పూవుని లేవనెత్తాడు

"ఎక్కడికీ !" అన్నది ఆ పూవు.

"వయసూ, వలపూ, సొగసూ కలిగియున్న యువతి మనోదర్పణం దగ్గరికి."

పూవు తృప్తిగా నవ్వుకుంది.

"అమ్మయ్యా ! అల్లాంటి చోటుకి తీసుకవెళ్ళు బాబూ ! నీ కెంతైనా పుణ్య ముంటుంది" అన్నది.

ఆ మేడ రెండో అంతస్థులోనికి తీసుకవెళ్ళాడు. అదొక అందంగా అమర్చియున్న జవరాలి పడక గది. గది అంతటా తెల్లగా వెన్నెల వెలుగులాంటి కాంతి వచ్చేటట్లుగా, కిటికీలకి గాజు పట్టర్న వేసివున్నాయి. తెల్లని సాటిన్ కవర్స తొడిగిన సోఫా సెట్టు, ఒక వారగా డ్రిస్సింగ్ టేబిల్, నిలువు టద్దం, పట్టుపరుపులు పరచిన గోద్రెజ్ మంచం, అధునాతనంగా అమర్చివున్నాయి. ఆ సోఫాలో వొయ్యారంగా కూర్చుని వున్నది. సన్నజాజితీగ లాంటి యువతి ! ఆమె చెంపలు పారిజాతపూవు రేకల ధవళత్వాన్నికలిగివున్నాయ్. కళ్ళు విశాలంగా, సోగగా, బరువుగా వున్నాయి. దానిమ్మపూ రేకల్లాంటి పెదాలు అదురుతున్నాయి. పూవు ముఖం వెయ్యి పున్నమల జాబిల్లిలా వెలిగింది. ఇంతటి సౌందర్యరాశి దగ్గరకు తన్నితీసుక వచ్చినందుకు సమీరుడికి ఎన్నెన్నో కృతజ్ఞతలు తెల్పుకున్నది.

"నాకు కృతజ్ఞతలు తర్వాత చెప్దువులే ! ముందు ఆమెను పలకరించు !" అన్నాడు సమీరుడు.

"నేను వొచ్చాను. నీ కోసం !" సంతోషంగా, ఆమె మెత్తటి పట్టుకుచ్చులాంటి జుట్టుమీద వాలి అన్నది - ఆ చిన్నమల్లెపూవు.

"ఎవరు నువ్వు?" అన్నద ఆ సౌందర్యనిధి.

"ఇంకా అడుగుతున్నావా సౌందర్యదేవతా! నీ అనురాగానికి రాగాన్ని! నీ హృదయ లాస్యానికి తాళాన్ని? నీ మనసులో ఉవ్విళ్ళూరే మనోగతాలకు భావాన్ని! నీ జీవితానందాన్ని! నీకోసం ఈ సృష్టిలో ఒక్క నీ కోసమే అవధుల్లేని ఆనంద సముద్రపు కెరటాల నురుగులల్లె పొంగుతున్న అంతులేని కోరికల్ని వేలవజ్రాల వెలతూగని సుందర స్వప్నాలని ఇంద్రధనుస్సు రంగుల్లో రంగరించి, నా పరిమళాన్ని అద్ది నీకు కానుకగా ఇస్తున్నాను స్వీకరించు! నన్నలంకరించుకొని నీ భర్తయొక్క సుధామయ స్వర్గవాసం సమీపానికి తెచ్చుకోగల అమృతవర్షిణివి కావాలనుకో!"

ఆమె ఒక్కసారి పల్చగా లేగులాబీ రంగులోవున్న అరచేతులలో ముఖం కప్పుకుని విలపించసాగింది. పూవు ఆశ్చర్యంగా సమీరుడికేసి చూసింది. వినమన్నట్లు సంజ్ఞ చేశాడు.

"నాకెందుకు? నాలోని ఆశలు, కోరికలూ ఏనాడో అగ్నిజ్వాలల్లోపడి దగ్ధమయ్యాయ్! నేను జీవచ్ఛవాన్ని! నాకుజీవితాశ లేదు. ఇల్లాగే నాలోనేను కుమిలి కుమిలి చావవలసిందే!"

పరీక్షగా చూసింది. ఆమెవెంపు ఆ పూవు! ఆమె తల దువ్వుకోలేదు ఆభరణాలు ధరించలేదు. ఏదో చెప్పుకోలేని అంతర్గత వేదనతో ఆమె కృశించిపోతున్నది! పూవుకి ఆమెని అనునయించాలని కోరిక కలిగింది.

"ఎందుకమ్మా ? పిచ్చిపిల్లా ? అంతబాధపడుతావు? నీ సౌందర్యంలో వెయ్యోవంతు కూడా లేని స్త్రీలు ఆనందంగా సంసారాలు చేసుకోవటంలేమా ? అమృతపాత్ర లాంటి జీవితం త్యజించటం దేనికనీ ? నా కానుకను స్వీకరించి ఆనందాన్ని ఆహ్వానించు !"

"ఆనందం ! నాజీవితానందమంతా వీడిచేత తాళి కట్టించుకున్నప్పుడే భస్మమైపోయింది. వీడి ధనానికి ఆశపడి నాబీదతల్లిదండ్రులు వీడివశం చేశారు ! నారాజుని నాకు శాశ్వతంగా దూరంచేశారు! ఈ ధనమూ, భోగభాగ్యాలూ ఎవరికి కావాలి! నా అనురాగమంతా ఆవిరై పోయింది ! నాకు మిగిలింది శూన్యం! ఈ శూన్యదృష్టితోనే నా చరమ దశకోసం నిరీక్షిస్తున్నాను. వీడి భర్తృభావం నేను భరించలేను. నాకు మృత్యువురాదు. నువ్వెళ్ళిపో ! నీ కానుక నా కుపకరించదు ! పరస్పర ప్రేమానురాగ జలధిలో, స్వర్ణ కమలాలు పంచుకున్న అనురాగవతుల దోసిళ్ళల్లో నీ కానుకలు ఒలకపోయి" ఆమె వెక్కి వెక్కి ఏడువసాగింది. నిర్ఘాంతపోయింది పూవు.

"నన్నెక్కడికి తీసుకవచ్చావోయ్ ! ఈమెగా రొక భగ్నప్రణయిని. వాళ్ళ హృదయాలలో దావాగ్ని ప్రజ్వరిల్లుతూంటుంది. వాళ్లని ఎల్లాంటి పాశవిక శక్తులూ వశపర్చుకోలేవు! వాళ్లు విరాగిణిలతో సమానం వాళ్ళరాగమయ జీవితపరిధిలో ఒకేఒకమూర్తిని నిలుపుకుంటారు. ఆ అనురాగ హృదయం శిథిలమైపోతే, భరించలేని నిర్వే

దంతో నిస్తేజమై పోతారు. యువతుల మనోదౌర్బల్యానికి తీరని ప్రణయ మొక సవాలు!" అన్నది ఆ పూవు.

సమీరుడు పూవును లేవనెత్తాడు.

"మళ్ళీ ఎక్కడికి"

విసుగ్గా అడిగింది పూవు.

"నీకోసం అనుక్షణం చేతులు చాచే విలాసిని వద్దకు తీసుకపోతున్నాను. విసుక్కోకు!" అన్నాడు సమీరుడు. ఆ మేడ మూడవ అంతస్తులో ఒక పెద్ద హాలులోనికి తీసుక పోయాడు ఆ పూవును.

అదొక విశాలమైనహాలు. ఆ హాలంతటా ఖరీదైన కార్పెట్లు పరుచబడి వున్నాయి. ఒకవార ఒక వృద్ధస్త్రీ, పాన్ దాన్ ముందేసుకుని తీరు బాటుగా గుప్పెడేసి ఒక్కపొడి, చేతికొచ్చినన్ని తమలపాకులూ నముల్తూ కూచున్నది. ఒక ముసలినౌకరు ఒకగోడ వెంపు బాలీసులూ, హుక్కాగొట్టాలూ అమర్చుతున్నాడు. ఒకవెంపు శృతి హార్మోని, తబలా, సితార్, సారంగ్ మొదలగు వాద్యాలున్నాయి. హాలులోకి వచ్చే గదిగుమ్మానికి బంగారురంగు జాలరు గొట్టాలతో మిలమిల మెరిసేటట్లు అల్లబడిన పరదా వ్రేలాడుతున్నది. ఇదేనా విలాసినీ! ఛీఛీ! నీకు మతి వుందా లేదా!"

"అంత తొందరెందుకూ! తీసుకపోతున్నాకద! చూడరాదూ?" జాలరు గొట్టాల పరదాలొంచి, ఆ గది లోనికి తీసుక వెళ్ళాడు. అక్కడ ఒక యువతి కాలికి గజ్జెలు

కట్టుకుంటున్నది. ఎదురుగావున్న చిన్న ఊయలమంచంలో నాలుగేళ్ళ పాప నిద్రపోతున్నది ఆ యువతి ఆకర్షణీయంగా వున్నది శరీరపు వొంపులు వ్యక్తమయ్యే అతి పల్చని జరీ వస్త్రాలు ధరించింది. వంటినిండా జిగజిగమెరిసే రవ్వల నగలు వున్నయ్! పూవుకి ప్రాణం లేచివచ్చినట్లుంది. ఆమె శరీరంనుంచి సున్నితంగా వస్తున్న పరిమళంలో పరవశించి పోతూ. "నేను వొచ్చాను. చూడు" అని ఆమె చెవిలో పలికింది.

ఆమె ఉలిక్కిపడింది. ఊయలలోవున్న పాపకేసి ఆతృతగా చూసింది.

"నాకేసిచూడు! ఇక్కడా" అన్నది ఆపూవు మృదువుగా.

"నువ్వా? ఎందుకు?"

2853

భ్రుకుటి ఆలోచనగా చిట్లించింది. నుదుట "స్నో"తో అంటించుకున్న చమ్కీతారకలు రాలి క్రిందపడ్డాయి.

"ఎందుకా! ఏం ప్రశ్న వేశావు? ఈ వసంతోదయాన్నే విరిసిన పూవును! ఆహ్లాదకరమైన ప్రకృతినుంచి నీకోసం ఎన్నెన్నో పూలతేనెల మధురిమలు నింపిన ఆశలు, సుందరమైన బంగారు స్వప్నాలు, ఇంద్రధనుస్సు రంగుల్లో రంగరించి, నీవిలాస జీవితం పరిమళ భరితం చేయటానికి కానుకగా తెచ్చాను. విలాసినీ! నీసోదరి నిండు హృదయంతో తనను నీకు అర్పించుకుంటున్నది. అలంకరించుకో! సమస్త పురుష ప్రపంచాన్ని నా పరిమళాలతో వివశుల్ని చేయి!" అన్నది.

విలాసిని ముఖం వివర్ణమైంది. క్షణంసేపు ఆమె ఏదో ఆలోచించింది.

"ఏమంటున్నావ్! విశ్వదేవుడిచ్చిన అమూల్య వరాన్ని ఈ క్షుద్రురాలికి కానుక చేస్తావా? అభాగినీ! నాలో బుసలు కొడుతున్న విష భుజంగాలు, ఆ మధురిమను ఆస్వాదింప నిస్తాయా? వొద్దు చెల్లీ! వొద్దు! నీ కానుక స్వీకరించేటంత నిర్మలతకి నేను నోచుకోలేదు! ఈ విషవలయంలోకి నిరంతర స్వప్నహాసినివి ఎలా వచ్చావు!"

"అక్కా! నీ కాలి గజ్జెల గలగలల్లో ఎంతోమంది వివశులౌతున్నారు. నీ కన్నుల కదలికలవల్ల వజ్ర హృదయులుకూడా కరిగి సురిగిపోతున్నారు. ఎందుకు నా కానుకను స్వీకరించవు? నేను నీ అందానికితగ్గ ఆహార్యాన్ని కానా?" నివేదనగా అన్నది ఆ పూవు.

"పిచ్చి పిల్లా!"

వ్యథ ధ్వనించింది విలాసినిగొంతు. "వారంతా నా కాలి గజ్జెల గలగలకి, కంటిలోని అందాల స్వప్నాలకి దాసులౌతున్నారంటావా! వాళ్ళు నిజంగా సౌందర్యోపాసకులూ, కళారాధకులూ అనుకున్నావు కాబోల్ను! వాళ్లు ఆ పరవశత్వం వందలూ, వేలూపోసి కొనుక్కుంటున్నారు. ధనంతో మత్తెక్కిపొయ్యారు వాళ్లు. మదిరా మానినీ వాళ్ళ ముఖ్య జీవితావసరాలు. నిప్పుల్లామండే ఆ మత్తుకళ్ళకి మా అమ్మమ్మైనా సరే! నవ నవోన్మేషమైన మనోల్లాసినిలానే కనపడుతుంది. వాళ్ళల్లో ప్రజ్వరిల్లే కాలకూట విషాల్ని మా

శరీరాల్లోకిపంపి వాళ్ల ధనానికి సార్థకత కల్పించామంటున్నారు. ఇంక నేను! నా జీవితం చివరి అధ్యాయంకోసం నిత్యనిరీక్షణలో రోజులు గడుపుతున్నాను. నా గానానికి పారవశ్యం లేదు. నా నృత్యానికి లయలేదు. నాలో భావం లేదు. నేను ఒక మట్టిబొమ్మను! ఇంకా ఈ అలంకరణ అంతా ఒక అలవాటు! అన్నీ అలవాటు! అంతే! వాళ్ళ చూపులుకాని, మాటలుకాని నాలో ఏ అనుభూతుల్ని కలిగించవ్! అందులో ఏ ఒక్క వ్యక్తీ నా హృదయాన్ని స్పృశించలేదు. ఎవరు ఎక్కువ కనకవర్షం కురిపిస్తే వాళ్ళకు అంకితం అవుతాను. ఆ శరీరార్పణలోకూడా నాలో ఏదో ఏవగింపు! వీలయితే నన్నావరించుకున్న మనిషిని పీకనులిమి చంపేయాలన్నంత కసి! ఈ నికృష్ట జీవితంలో నీ అమూల్య కానుకను ఎలా స్వీకరించను? ఏం చేసుకోను?''

బాధగా కళ్ళు మూసుకొంది విలాసిని. ఆమె కళ్ళ వెంట నీళ్ళొచ్చి కాటుకంతా కరిగి చెంపలమీదుగా జారసాగింది హాలులో జంత్ర వాయిద్యాలు శ్రుతులు పెట్టబడుతున్నాయి. సన్నని అగరుధూప పరిమళంతో ఆ వాద్యాల మధుర నాదాలు హాలంతా అలముకొంటున్నాయి. పూవుకూడా నిషాకలిగి తూలి పడబోయింది.

"అయ్యో! కన్నీరు! ముఖమంతా మళ్ళీ కడుక్కోవాలి. పౌడరు పులుముకోవాలి! పాపని చూసావా నువ్వు! నా పాపని చూడు! వారం రోజులుగా జ్వర తీవ్రతతో పడి వుంది. కాని నాకు దాన్ని సముదాయించటానికి తీరిక లేదు.

ఆ బెంగ ముఖంమీద కన్పరచ కూడదు. చక్కగా కులుకుతూ నవ్వాలి. హృదయంలో ఏడుస్తున్నా కళ్లతో కవ్విస్తూ చూడాలి. హాయిగా దుఃఖించటానికికూడా నోచుకోలేదు చెల్లీ! వెళ్ళు! చప్పున వెళ్ళిపో ! నా విషగాలుల్లోపడి నీ కానుకలు పసివాడి వన్నె తరగకముందే ఏ కన్నెపిల్ల కాటుక కళ్ళల్లోనో మెరిసే జలతారు కలల దారాల్లో చిక్కపడనీయి! ఆ స్నిగ్ధ సుకుమారహృదయం ఊహల ఉయ్యాల లూగుతుంటే, నీ కానుకలు సంపూర్ణత్వాన్ని సిద్ధింప చేసుకుంటాయ్! వెళ్ళు చెల్లీ! ఆలస్యం చెయ్యకు !" ఆమె బాత్‌రూంలోకిపోయి తలుపేసుకున్నది.

పూవు నిరాశగా సమీరునికేసి చూసింది. సమీరుడు ఓదార్చ లేవనెత్తబోయాడు.

ఆ పూవు రేకలు జలజల్లాడాయ్ !

"నాకీ అనుభవం చాల్ను సమీరా ! నాకు నిస్పృహ కల్గుతున్నది. ఉదయనించీ యీ సుందరనారీమూర్తులు నన్ను చూడగనే సంతోషంగా చేతులుచాచి తమ పీసీల కుంతలాల్లో బంధించుకుని మురుస్తారని ఆశించాను. ఆ ఆశ రెక్కలొచ్చిన పిట్టల్లే ఎగిరి పోయింది. ఈ నారీమూర్తుల జీవిత నగ్నసత్యాలు నేను సహించలేకుండా వున్నాను. ఈ స్త్రీల ఆనందం అంతా కల్పితమైనదనీ, వాళ్ళ అంతర్గతాలు తీవ్ర అశాంతికి నిలయాలనీ నాకు తెలిసొచ్చింది. నేను సూర్యభగవానుని తీక్ష్ణకిరణాలతో తప్తమవకుండా చూడు!" అని ప్రార్థించింది.

"ఒక్కనిమిషం ఓపికపట్టు ! అరుణుడు పశ్చిమాద్రి కరిగేలోపున నీవు విశ్రాంతి పొందుతావు !" అని లేవ నెత్తాడు

"మళ్ళీ ఎక్కడికి!"

"కన్నె కాటుక కళ్ళు కనే ఉజ్వల స్వప్నాల పరిధి లోనికి "

మేడ నాలుగవ అంతస్తులోనికి తీసుకపోయాడు. అదొక చిన్నగది. ఆ గదికి నాలుగు వేపులా పెద్ద పెద్ద కిటికీలు వున్నాయి. ఆ కిటికీలకి అందంగా ఎంబ్రాయిడరీ చేసిన తెరలు వ్రేలాడగట్టబడినాయి చిన్న అద్దాల బీరువా నిండా తీర్చినట్లు సర్దబడిన బైండు పుస్తకా లున్నాయి. ఒక కిటికీలో రకరకాలపూలు అమర్చిన ఫ్లవర్ వాజ్ వున్నది. ఒక గోడవార సితార్ వున్నది. ఒక కిటికీవద్దనున్న చిన్న కుర్చీలో పదహారేళ్ల కన్నెపిల్ల కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటున్నది. ఆ ప్రశాంతతామూర్తిని చూడగనే "హమ్మయ్య" అనుకున్నది ఆ పూవు!

"నేను వచ్చాను నీకోసం!"

ఆపిల్ల దగ్గరగా వెళ్ళి అన్నది పూవు. మెత్తగా దీక్షగా చదువుకుంటున్న ఆ అమ్మాయి ముఖం చిట్లించి.

"ఎవరునువ్వు ? ఎందుకువచ్చావు" అంది—

"నీలక్కను! నీకోసం ఈసృష్టిలోనిసమస్త చైతన్యానికి ఆలంబమైన జీవన సత్యాలతో సంపూర్ణమౌతున్న

ఆశలూ, ఆ ఆశలు మోసుకొత్తించే మధురస్వప్నాల నన్నిం టినీ ఇంద్రధనస్సు రంగుల్లోంచి ఒంపి నీ కన్నె హృదయానికి కానుకగా తెచ్చాను. స్వీకరించు! నీ జీవితాన్ని పూర్తిగా అనుభవించు!"

ఆ పిల్ల పుస్తకంమూసేసి కిలకిల నవ్వింది. ఒక్కసారి లేచినుంచుని సితార్ తీగలు మీటింది. గది అంతా ఒకసారి పన్నీరు వర్షించినట్లు వెన్నెల కురిసినట్లు పులకరించింది.

"భలేగా అన్నావు నువ్వు! జీవితం! అనుభవం! ఈ రెండుమాటలూ నేను ప్రతి పుస్తకంలోనూ చదువుతూనే వున్నాను. ప్రతిగీతంలోనూ పాడుతున్నాను. కాని నాకొక్క సందేహం! జీవితం అంటే ఏమిటి? అనుభవమంటే ఏమిటి?"

"నువ్వు పెద్ద వేదాంతిలా వున్నావే! నిండా పదహా రేళ్ళ పసిదానివి! ఇంత పెద్ద జిజ్ఞాసలో ఎందుకు పడ్డావు?"

"నీకు తెలీదులే! నువ్వేం చదివావనీ? క్షణంలో వాడి పోయే పువ్వువి! అందం వున్నంతసేపూ గర్వంగా తిక్కగా వుండటం, తర్వాత ఏడుస్తూ చేతులు ముడుచుక కూర్చోవటం మీ లక్షణం. కానీ నేను చెప్తున్నాను విను! జీవితం అంటే ఏమిటి? పూసినపువ్వా? పసిపాపనవ్వా? జవరాలి కళ్ళల్లో కళకళపడే ప్రంగాఢకాంక్షా! వీటిలో ఏం మిగులుతుందీ? ఏది స్థిరమైన జీవత్వం సంతరించుకొన్నది? అనుభవం అన్నావు. కాని అనుభూతి క్షణికం అని నీకు తెలీదు! ఆ అనుభూతిని పొంది నాశనమయ్యే మనం కేవలం అనుభూతిని

పొందాలన్న ఆకాంక్షైనా జీవితం అంతా పొడిగించుకో లేమూ? అనే జిజ్ఞాసలో వున్నాను”

“బాగుంది నీపసితనపు భావాలు చాలించు! నా కానుకలు స్వీకరించి కాబోయే రాకుమారుణ్ని అలరించు! సంపూర్ణమైన యౌవనం అంతా వింతవెలుగులతో నింపుకో! జీవితం అంతా ఒంటరివై నిర్వేదం పాలు కాకు!”

ఆ పిల్ల పూవు హితబోధకి నవ్వింది.

“పిచ్చిదానా! నేను ఒంటరి నెందు కవుతాను? నా క్కావలసినంత మంది బంధువుల్ని నా భావనా ప్రపంచంలో సృజించుకో గలను. ఆ సృజనాత్మక శక్తి నాలో అంతర్వాహినిగా ప్రవహిస్తున్నది. తెలుసా? ఈ క్షణికా నందకారకాలయిన మూఢ కాంక్షల్తో నన్ను నేను నా పుజ్యాల భవిష్యత్తుకి దూరం చేసుకోలేను! నువ్వు చప్పున నన్ను వదిలివెళ్ళు! నీవిచ్చే కానుకలు నా మనస్సుని ఉన్మత్త పరచక మునుపే నువ్వెళ్ళిపో!”

“నీకు నిక్షిప్తధనంలా లభ్యమయ్యే ఈ జీవితానం దాన్ని అనుభవించలేవా?”

“నామీద నీ కేమయినా దయుంటే చప్పున వెళ్ళిపో! నా నిశ్చలత్వాన్ని భంగంచేస్తే నీకేమి వొస్తుందీ? అదుగో! అటుచూడు! సాయంకాలం అయిపోతోంది! ఆనీలగగనం అంతా అరుణరాగరంజిత మయిపోతున్న దే? నే నిప్పు డేం చేస్తానో తెలుసా! ఈ కిటికీలోంచి చూసుక పోయి, ఆ మేఘాల చివర్లలోంచి, ఈ లోకంలోని సువాసిను

లకు సంధ్యాకాంత విసరివైచే పసుపుకుంకుమలను నేను నుదుట తిలకంగా ధరిస్తాను! శశాంకాగమనంతో తేలి పోయే వెండిమబ్బులమీద పాలపుంత వెంబడి ప్రయాణిస్తూ, నక్షత్రా లన్నిటినీ నా చెంగులో మూట కట్టుకుంటాను. ఉషోదయంలో, ఆ నక్షత్రాలన్నీ ఆకాశం మీదకు వదలి వేస్తాను. మామిడి చిగుళ్ళన్నిటితో నా చెంగును నింపుకుని, కోకిలమ్మకి నోటికి అందిస్తాను. అవి నా ఒక్క-దానియొక్క-చెవిలోనే కమ్మటి సంగీతాన్ని ఆలపిస్తాయి. నువ్వన్నావే ఇంద్రధనుస్సు రంగులనీ? ఆ ఇంద్రధనుస్సు వొంపులమీద నే నెన్నిసార్లు నృత్యం చేసానో నీకేం తెలుసు? ఆ నృత్య గీతాల్లో కలిగిన ఆనందోద్వేగంలా, నా శరీరము అవశమై పోగా వుత్పన్నమయ్యే స్వేదబిందువులవల్ల, నా పాదాల లత్తుక కరిగి, రాబోయే వర్షసూచనగా భూమి మీదికి బొట్లు బొట్లుగా కారిపోతుంది! వోహ్హా! ఇంక వెళ్ళు! చప్పున వెళ్ళు! నీ పరిమళాన్ని సాధారణ లాలసు లెవ రైనా అనుభవించగలరు! నా మధురభావనా ప్రపంచం లోనికి, నలికెళ్ళి పాములా వచ్చావు నువ్వు! ఫో అవత లికి!"

అ పిల్ల, కిటికీ వూచల్లోంచి ఆకాశంలోకి చూస్తూ తన్మయావస్థలో కళ్ళు మూసుకుంది!

సమీరుడు పూవుని మృదువుగా లాలించి పైకి లేవ నెత్తాడు. పూవు ఆవేదనగా అన్నది.

"నీకు చేతులెత్తి మ్రొక్కుతున్నాను. సోదరా! నే నింకెక్కడికీ రాలేను. నాకు విశ్రాంతి నియ్యి!"

దూరంగా పూరి చివరకునున్న ఆలయంలో ఘంటా నినాదం సాంధ్యపూజకి సూచనగా వినబడింది.

"అవును! నీకు చిరవిశ్రాంతి సమయం అసన్న మయింది. అందుకనే, భగవానుని, చరణాలవద్ద పూజాప్రసూనంగా నిన్ను తీసుకపోతాను."

పూవు దిగ్భ్రాంతిగా చూసింది.

"నేనా! భగవానుని పూజా ప్రసూనంగా వుపకరిస్తానా! అప్పుడే విరిసినపూవుని కానే! ఇల్లిల్లూ తిరిగితిరిగి అలసనై పూర్వపు పరిమళాన్ని కోల్పోయానే! ఆ స్వామికి కానుకగా ఏమివ్వగలనూ?"

"పిచ్చిపిల్లా! భగవానునికి కానుకలు ఇవ్వాలా! పశ్చాత్తాపముతో తప్తమయిన నీ హృదయం చాలును! రక రకాల అనుభూతులతో నీవు, నిరహంకారివైనావు! నీలో జ్ఞానకమలం విరిసింది! నువ్విప్పుడే, నిజంగా విరిసిన పూవువి! నీలో అవివేకము లేదు. భగవానుడు తన మణి హారంలో నాయికమణిగా నిన్ను చూసుకుంటాడు!" ఆదరంగా అన్నాడు సమీరుడు.

"నే నెంత వ్యర్థురాలినోయ్! రోజల్లా ఈ నారీ మూర్తుల సిగల్లోనుండి లౌకిక వాంఛల్ని పొందుదామన్న సంకల్పమే కానీ, భగవంతు డొకడున్నాడనే తలంపేనా,

లేకుండా గడిపేసాను ! ఆ స్వామి నన్నెల్లా స్వీకరిస్తారు ? నేనెలా ఆర్థించగలను !"

"దీనికి నా సమాధానమేమి లేదు చెల్లీ! అదుగో శ్రావ్యంగా వినవచ్చేగీతం విను! నీకే తెలుస్తుంది!"

పూవుని ఆలయము ముందరనున్న పుష్కరిణి మీదకు తెచ్చాడు. కోవెల్లో ఎవరో భక్తులు పాడుతున్నారు.

"ఆకటి వేళల, అలపైన వేళల

వేకువ, హరినామమే దిక్కు.

మరి లేదు !! !!

కొరమాలి వున్న వేళ-

కులము చెడినవేళ"......

పుష్కరిణినుండి వచ్చే జల తరంగాలమీాది తుషార బిందువులతోపాటు, ఈ అన్నమాచార్యుల కీర్తనయొక్క ధ్వని తరంగాలు కూడా కలిసి, పూవుయొక్క ముఖము కల కల విరిసేటట్లు చేసింది. సమీారుడికేసి కృతజ్ఞతగా చూసి నవ్వింది ఆ చిన్నమల్లె! చిన్నారిపూవు! అంతే! ఒక్క పూవులో, దేవప్రతిమ పాదాలచెంత పూజా ప్రసూనంగా నిలబెట్టాడు సమీారుడు !